




టిడిపి వైపు 'ఆనం' అడుగులు..!

సీనియర్ రాజకీయ నేత, వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి వైసిపిపై తీవ్ర వ్యతిరేకతలోఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాలన పట్ల అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు చూడలేదని తన అభిమానుల వద్ద వాపోతున్నట్లు తెలుస్తోంది. గత కొంత కాలంలో ఆయన ప్రభుత్వ, పార్టీ పట్ల బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ఆయన పార్టీ మారుతారని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో సంచలన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. తాను, తన రాజకీయ వారసులను రంగ ప్రవేశం చేయడానికి పావులు కదుపుతున్నారు. ఆయన ఏం నిర్ణయం తీసుకుంటారు. రానున్న రోజుల్లో రాజకీయాలు ఎలా మారుతాయోనని ఆసక్తి ప్రజల్లో నెలకొంది.

- పార్టీపై తీవ్ర వ్యతిరేకత
- ప్రభుత్వ తీరుపై అసంతృప్తి
- భవిష్యత్తుపై అభిమానులతో చర్చలు
- కొద్ది రోజుల్లో సంచలన నిర్ణయం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఆనం రామనారాయణ రెడ్డి జిల్లాలో ప్రముఖ రాజకీయ నేత, సుదీర్ఘ అనుభవం కలిగి ఎన్‌టి రామారావు, ఎన్, జనార్ధన్‌రెడ్డి, కోట్లవిజయభాస్కర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, మర్రి చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. కిరణ్‌కుమార్‌రెడ్డి, కె,రోశయ్య, వంటి హేమా హేమీల పాలనను చూడడం, భాగస్వామ్యం కావడం తెలిసింది. ఆనం కుటుంబానికి జిల్లాలో మంచి గుర్తింపు ఉంది. ఆనం రామనారాణరెడ్డి పలుమార్పు రాష్ట్ర మంత్రి వర్గంలో పనిచేయడంతోపాటు, ఓదశలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా పేరు వచ్చింది. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. 2019 ఎన్నికల్లో ఆయన వైసిపిలో చేరారు. ఆత్మకూరు తన నియోకవర్గం అయినప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు వెంకటగిరి నుంచి పోటీ చేసి, గెలిచారు. అక్కడ తనకు పెద్దగా అభిమానులు లేకపోయినా గెలిచిన తరువాత వెంకటగిరి నియోజకవర్గంలో తన బలాన్ని, బలగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎంతో రాజకీయ అనుభవం కలిగిన ఆయన గత కొంత కాలంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న విధానాలు పట్ల సానుకూలంగా లేరని తెలుస్తోంది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి, మంత్రులు భాష, తీరు పట్ల అనేక సార్లు ఆవేదన వ్యక్తం చేసిన పరిస్థితులున్నాయి. ప్రభుత్వ తీరు పట్ల అనేక సార్లు బహిరంగంగానే విమర్శలు చేశారు. అభివృద్ధిని పూర్తిగా వదిలేసి, సంక్షేమం పేరుతో కాలక్షేపం చేయడం, ప్రతిపక్షాలు, ప్రజల పట్ల మంత్రులు, ఎంఎల్ఎ తీరుతో ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పార్టీనేతలకు చెబుతూ వస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో జరుగుతోన్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపైనా ఆయన విమర్శలు గుర్పించారు. ఆదే క్రమంలో నెల్లూరు నగరంలో ఆనం గ్రూపును దెబ్బతీయడానికి ఎంఎల్ఎలు చేస్తున్న ప్రయత్నాలను ఆనం సోదరులు తిప్పికొడుతూనే ఉన్నారు. రైతులకు సాగునీరు ఇచ్చే విషయంలోనూ ఆయన ఐఎబి సమావేశంలో తన అభిప్రాయాలు సూటిగా చెప్పేవారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రికి ఆనం రామనారాయణరెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు చేశారు. నియోజకవర్గం సమస్యలు చెప్పడానికి ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, ఆయనకు , ఆయన గ్రూపు నేతలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడం తెలిసింది. ఇటీవల ఆయన స్వరం మార్చారు. పది రోజుల క్రితం జరిగిన వలంటీర్లు, గ్రామ సారధులు మీటింగ్‌లో ప్రభుత్వం, పార్టీ తీరును ఎండగట్టారు. " పింఛన్ ఇవ్వడం తప్ప మనం ఏం చేశాం. ఒక్క అభివృద్ధి పని చేయలేదు. ఏ ముఖం పెట్టుకొని వెళ్లి ఓట్లు అడుగుతాం. చెప్పుకోడానికి ఏమీ లేదు " అంటూ విమర్శలు చేశారు. దీనిపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి "ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. మనం ఏం చేయగలం " అని చెప్పారు. జెడ్‌పి ఉపాధ్యక్షురాలు పొట్టేళ్ల శిరీషా ఆనం రామనారాయరెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో ఆనం తన అభిమానులు, స్నేహితుల వద్ద అనేక సార్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. గతంలో "పలుమార్లు ఎంఎల్ఎగా పనిచేసి ప్రజలకు ఏదొక పనిచేశాననే సంతృప్తి ఉంది. మూడేళ్లలో ఏం చేయలేకపోయాను. వలంటీర్లతో వెళ్లి కరపత్రం ఇచ్చి ఇది చేశాం, అది చేశాం అని ఫొటోలు తీసుకోవాల్సి వస్తుంది " అని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వైసిపి నేతలు ఆనం పార్టీ మారుతారనే ప్రచారం చేస్తున్నారు. మరోవైపు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుమారుడు రామ్‌కుమార్‌రెడ్డి సిఎం చెప్పడంతో ఆనంను నేనే గెలిపించానని, సిఎం ఆదేశిస్తే వెంకట గిరి నుంచి పోటీచేస్తానని ప్రకటించారు. ఈ విషయం పైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.



ఆనం రామనారాయణరెడ్డి, ఎంఎల్ఎ

టిడిపి వైపు ఆనం అడుగులు..!

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వైసిపి, ప్రభుత్వ తీరుపై అంసతృప్తితో ఉన్న ఆనం రామనారాయరెడ్డి టిడిపి వైపు చూస్తున్నారని తెలుస్తోంది. ఎందరితో పనిచేసిన తను, అనుభవం లేని ముఖ్యమంత్రి వద్ద పనిచేసినా ఏం ప్రయోజనమూ లేదని, ఆయనను బలపరిస్తే భావితారాలకు ద్రోహం చేసినట్లు అవుతుందని తన అన్యాయులతో అన్నట్లు తెలిసింది. తన రాజకీయ భవిష్యత్తు కోసం కాకపోయినా రాష్ట్రంలో ప్రస్తుతం నెలకున్న పరిస్థితుల్లో ఆయన వైసిపి నుంచి బయటకు రానున్నట్లు తెలుస్తోంది. జనవరి చివర, లేదా ఫిబ్రవరిలో ఏదొక నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. ఇప్పటికే ఆత్మకూరు, వెంకటగిరి, నెల్లూరులోని తన అనుయాయులతో మాట్లాడినట్లు సమాచారం. అందరూ వైసిపి పాలనకు వ్యతిరేకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ మారడం దాదపు ఖరారైనట్లు తెలుస్తోంది. జూన్, జులైలలో మధ్యంతర ఎన్నికలు వచ్చేలా ఉన్నాయని, ఆలోపే ఆయన నిర్ణయం తీసుకుంటారని సమాచారం. రాజకీయాల్లో ఏదైనా, ఎప్పుడైనా సాధ్యమే. ఏం జరుగుతుందో చూద్దాం.



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎంఎల్ఎ

సిఎంతో 'కోటంరెడ్డి' భేటీ

- 45నిముషాలు చర్చ
- అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం గ్రీన్ సిగ్నల్
- అంతర్గత చర్చలపై నోరు విప్పని ఎంఎల్ఎ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సిఎం జగన్మోహన్‌రెడ్డితో నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. సిఎం ఆహ్వానం మేరకు సోమవారం సాయంత్రం 6.30నుంచి 7.15గంటల వరకూ చర్చలు జరిగాయి. 20నిముషాల పాటు సిఎం కోటంరెడ్డితో ఏకాంతంగా మాట్లాడారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి, ధనుంజయరెడ్డి కోటంరెడ్డితో మరి కొంతసేపు సిఎం చర్చించినట్లు సమాచారం. గడపగడపకు తిరగాలని, ఎట్టి పరిస్థితుల్లో ఆపొద్దంటూ సిఎం ఆదేశించినట్లు సమాచారం. తనకు ఆరోగ్యం సరిగాలేదని, అందువల్లే ఆలస్యమైందని కోటంరెడ్డి వివరించినట్లు తెలిసింది. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని, ప్రభుత్వాధికారులు సహాయ నిరాకరణ చేస్తున్నారని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ధనంజయరెడ్డికి చెప్పి ఆ సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పొట్టేపాళెం కలుజు, బారాషాహిద్ దర్గాకు నిధులు, వావిలేటిపాడు వద్ద మూడువేల ఇళ్ల స్థలాలకు సంబంధించిన పరిహారం, కొమ్మలపూడి, దొంతాలి లిఫ్ట ఇరిగేషన్ పనులు, గురుకుల పాఠశాల, అంబేద్కర్ భవన నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయాయని చెప్పారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకతతో పార్టీ మారుతారని నేపథ్యంలో సిఎం ఆయనను పిలిచి బుజ్జగించినట్లు సమాచారం. నెల్లూరు నియోజకవర్గంలో అభివృద్ధికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి ఆయనను సంతృప్తి పరచే ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. సిఎం, కోటంరెడ్డి ఏకాంత చర్చల్లో ఏయే అంశాలు చర్చకొచ్చాయనే చర్చపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఆసక్తి నెలకొంది. ఇవి తమ వ్యక్తిగత విషయమని బయటకు చెప్పాల్సిన అవసరం లేదంటూ కోటంరెడ్డి వ్యాఖ్యానించారు.

బ్లాక్ మార్కెట్‌లో

యూరియా అమ్మకాలను అడ్డుకోవాలి

ఎపి రైతు , కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

బ్లాక్ మార్కెట్లో యూరియా అమ్మకాలను అడ్డుకుని జిల్లాలో వరిపంట సాగుబడి చేస్తున్న రైతులకు సరిపడా ఆర్‌బికే కేంద్రాల ద్వారా, సొసైటీల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపి రైతు , కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం జిల్లాలో నెలకొన్న యూరియా కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని, బ్లాక్ మార్కెట్‌లో యూరియా విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపి రైతు , కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టాయి. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు, పొట్టేపాళెం చంద్రమౌళి మాట్లాడుతూ జిల్లాలో 6 నుంచి 7 లక్షల ఎకరాల్లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు వరి సాగు చేస్తున్నారన్నారు. వీరందరికీ యూరియా అవసరముందన్నారు. జిల్లాలోని ఎక్కువ మండలాల్లో వరి సాగుబడి చేస్తున్న రైతులకు యూరియా అందుబాటులో లేదన్నారు. వాస్తవానికి మార్కెట్ ధరకు అధనంగా మరో రూ.70లు కలిపి బ్లాక్ మార్కెట్‌లో యూరియా బస్తాప్రయివేట్ వ్యక్తులు విక్రయి స్తున్నారన్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా, సొసైటీల ద్వారా రైతాంగానికి అవసరమైనత మేరకు యూరియా సరఫరా చేస్తామని ప్రకటించిందన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు అందజేస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. ప్రభుత్వం చేసిన ప్రకటనలు కేవలం కాగితాలకు పరిమితమయ్యాయన్నారు. సమస్యలన్నింటికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నామన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో రబీ సీజన్ ప్రారంభం అయిన తరువాత జిల్లాలో ఆలస్యంగా రబీ సీజన్ ప్రారంభం అవుతుందన్నారు. అందువల్లనే జిల్లా లో వరి పంట సాగుబడి చేసే రైతాంగానికి యూరియా సరిపడా సరఫరా అయ్యేదని, ఈ ప్రభుత్వ హయాంలో మాత్రం అందుకు విరుద్ధంగా యూరియా సరఫరా అవుతుందన్నారు. ఈ పరిస్థితి ఎందుకు ఆసన్నమైందో రైతులకు అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. తక్షణమే ఆర్‌బికే కేంద్రాల్లో, సొసైటీ సంఘాల్లో యూరియా అమ్మకాలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు పి.రమేష్, ఓడూరు వెంకట క్రిష్ణయ్య, జి.బుజ్జయ్య, గురునాధం పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడారు. రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు : కాకాణి

ప్రజాశక్తి- వెంకటాచలం

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలం, చెముడుగుంటలో సోమ వారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ వివిధ పథకాల కింద వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి కి స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మీడి యాతో మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ల పంపిణీ చేస్తా మన్నారు. తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ సుస్మిత, మాజీ జెడ్‌పిటిసి మండల వెంకట శేషయ్య, రాచాల రవికుమార్ యాదవ్, కుంచా రమేష్ యాదవ్, ప్రజా ప్రతి నిధులు స్థానిక నాయకులు సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఎంపిపి పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపిడిఓ షేక్ రఫీక్ అహ్మద్ తెలిపారు. జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, సర్పంచులు, ఎంపిటిసిలందరూ హాజరవుతారన్నారు.

పొట్టేపాళెం కలుజుపై

హైలెవల్ వంతెన నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రమాదాలకు నిలయంగా ఉన్న పొట్టేపాళెం వద్దనున్న కలుజుపై హైలెవల్ వంతెన నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలంటూ సిపిఎం రూరల్ కమిటీ, బుచ్చి మండల కమిటీలు స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం నాయకులు పొట్టేపాళెం చంద్ర మౌళి, గండవరపు శ్రీనివాసులు, ఆలూరి తిరుపాలు మాట్లాడుతూ గత నాలుగేళ్ల నుంచి పో ట్టే పాలెం కలు జు పై స్వర్ణాల చెరువు నుంచి పెన్నా నదిలోకి నీళ్ల ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయన్నారు. ఈ కారణంగా కలుజు రోడ్డుపై పాచి పట్టి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిందని ఇప్పటికి ఐదు మంది మృతి చెందారన్నారు. ఈ సమస్యపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి పాలెం కలుజుపై హైలెవల్ వంతెన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముత్యాల గురునాథం, మంగలి పుల్లయ్య, జొన్నలగడ్డ వెంకమ రాజు, తుళ్ళూరు గోపాల్, నాయకులు ముత్యాల నాగయ్య పూడిపర్తి జనార్ధన్, పల్లవరపు చెంచయ్య, ఎడవల్లి రమణయ్య, గరికపాటి సురేష్, వేగూరు వెంకయ్య, పచ్చ మధు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఉత్తమ వైద్యులుగా ఐదుగురు ఎంపిక

నెల్లూరు : జిల్లాకు చెందిన 5 మంది డాక్టర్లు ఉత్తమ కుటుంబ డాక్టర్లుగా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్(కుటుంబ వైద్యులు) గా ఉత్తమ సేవలందించిన వారిని జిల్లాల వారీగా ప్రకటించిందన్నారు. ఆ ప్రకారం జిల్లా నుంచి కలువాయి, చాకలి కొండ, జగదేవపేట, దగదర్తి, దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు సురేంద్రబాబు, సజన, సుచిత్ర, అఖిల, సయ్యద్ అయూబ్ లు ఉత్తమ డాక్టర్లుగా ఎంపిక య్యారు. సోమ వారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జరిగిన స్పందన కార్యక్రమంలో లెక్టర్ వారిని అభినందించారు. రోణంకి కూర్మానాద్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు సభలపై వైసిపి కుట్ర

బిసి సంఘం రాష్ట్ర నాయకులు సంపత్ యాదవ్



సంపత్ యాదవ్, బిసి సంఘం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : చంద్రబాబు పర్యటనలపై వైసిపి కుట్ర పన్నిందని బిసి సంఘం రాష్ట్ర నాయకులు ఒట్టూరు సంపత్ రాజు ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నాయుడు ఓ రాజకీయ నేతగా నలభై ఏళ్ల నుంచి ర్యాలీలు నిర్వహిస్తున్నారని, లక్షల మంది పాల్గొన్న సమావేశాలకు హాజర య్యారు. ఎక్కడా ఎలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోలదన్నారు.కందుకూరు, గుంటూరులో జరిగిన సంఘటనలు దురదృష్టకర మన్నారు. ఈ ఘటనలను రాజకీయం చేయాలని వైసిపి కుట్ర పన్నిందన్నారు. కేవలం వైసిపి ప్రభుత్వ హాయంలో మాత్రమే ప్రతిపక్ష నాయకుడు సభల్లోనే వరుసగా తొక్కిసలా టలు..ప్రాణనష్టం చోటు చేసుకుంటున్నాయన్నారు. కారణం ప్రతిపక్ష నాయకులు పర్యటన సమయంలో ఈ ప్రభుత్వం పోలీసుల భద్రతను కుదిస్తుందన్నారు. అందుకే టిడిపి తరపున పెద్ద ఎత్తున వాలంటీర్లను ఏర్పాటు చేసుకుం టున్నామని, స్వయంగా జనాన్ని నియంత్రిం చుకుంటున్నా మన్నారు. అయితే నీలి సోషల్ మీడియా వార్తలు దారుణమన్నారు. చంద్రబాబును బూతులు తిట్టేందుకు కొంత మందిని ఆరెంజ్ చేసి తమ తిట్ల దండకాన్ని వినిపించారన్నారు. ఒకరిద్దరు మహిళలే అన్ని యూట్యూబ్ చానళ్లలో మీడియాతో మాట్లాడటం.. ఇది పక్కా ముందస్తు ప్రణాళిక అనటానికి ఇంతకన్నా ఏం కావాల న్నారు. ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని హితవు పలికారు. కందుకూరు, గుంటూరు ఘటనలు విచారకరమన్నారు.

మైనారిటీలను విద్యకు దూరం చేయెుద్దు

ఉపకార వేతనాలను పునరుద్ధరించాలి - 'ఆవాజ్' డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు


కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనారిటీల స్కాలర్‌షిప్‌లను అర్ధాంతరంగా నిలిపివేసి ఓపథకం ప్రకారం ఆయా వర్గాలను విద్యకు దూరం చేస్తుందని ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రషీద్ విమర్శించారు. మైనారిటీలకు ఇచ్చే ఉపకార వేతనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తొలుతు నిరసన ప్రదర్శన గాంధీబోమ్మ సెంటర్ నుంచి విఆర్‌సి సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. అక్కడ జరిగిన దర్నాకు పలు ప్రజాసంఘాలు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ తదితర సంఘాలు మద్దతుత తెలిపాయి. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనారిటీలను విద్యకు దూరం చేయాలనే ఉద్దేశ్యంతో విద్యార్థులకు వస్తున్న ఉపకార వేతనాలను, ఫెలోషిపులను నిలిపివేయడం దుర్మార్గమన్నారు. ఇటీవల కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి స్మృతి ఇరానీ పార్లమెంటులో మైనారిటీలకు ఇచ్చే ఉపకార వేతనాలు భవిష్యత్తులో ఉండవు అని చెప్పడం చూస్తే కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలుస్తుందన్నారు. మైనారిటీ వర్గాలను విద్యకు దూరం చేసే నిర్ణయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మైనారిటీ నాయకులు జియోఉల్ హాక్ నాయకులు మాట్లాడుతూ ఆవాజ్ కమిటీ చేస్తున్న ఆందోళన కార్యక్రమానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మైనారిటీ విద్యార్థుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను, మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌లను యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జియాఉల్ హక్క నాయకులు ఉమర్, నవీద్, అనీఫ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ అధ్యక్షులు బీపీ నరసింహ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హర్ష, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఎం భాష, షేక్ రియాజ్, షేక్ అన్సర్ షేక్ చాన్ బాషా, సర్దార్ అహ్మద్, మునీర్ అహ్మద్, హుమయూన్ నగర కార్యదర్శి షేక్ రియాజ్ అధ్యక్షుడు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆవాజ్ నాయకులు

దుప్పట్లు పంపిణీ

తోటపల్లిగూడూరు : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మండలంలోని నరుకూరు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో దుప్పట్లు పంపిణీ చేశారు. "హెల్పింగ్ హాండ్స్" సంస్థ ఆధ్వర్యంలో, చర్చి చైర్మన్ సాదేపల్లి బోయ దాస్, సెక్రటరీ సాదేపల్లి బాల ప్రసాద్, ట్రెజరర్ దువ్వూరు కోటేశ్వరరావు పర్యవేక్షణ లో జరిగిన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. వైసిపి కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, మాజీ సర్పంచ్ ఆకుల మధు, వెలిచర్ల శ్రీనివాసులు, విశ్వాసులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరులో...

నెల్లూరు :పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్,రత్నమ్మ చారిటబుల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సండే మార్కెట్ యూనియన్ అధ్యక్షులు ఎమ్.డి. హఫీజుద్దీన్ సౌజన్యంతో సోమవారం బాలాజీ నగర్ లోని గీతామయి వద్ధుల ఆశ్రమం నందు వద్దులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. విశ్రాంత లేబర్ కమీషనర్ రాచపాలెం రఘు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడారు. ఆశ్రయం అధినేత తమ్మినేని పాండు, గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరవ రాయప్ప, టివి.నటులు సింగంశెట్టి మురళీమోహన్ పాల్గొన్నారు.

విరాళం అందజేత


ప్రజాశక్తి -కందుకూరు :అంకమ్మ తల్లి ఆలయ పునర్ నిర్మాణం కోసం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి కృషి చేస్తున్నారు. ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమ్మవారి పాదాల చెంత ఉంచే సువర్ణ యంత్రానికి సోమవారం మొల్లమూరి శ్రీనివాస్ భార్య ప్రశాంతి కుమారుడు మనో సాత్విక్ ఒక గ్రామ బంగారం కొరకు నగదు రూపంలో రూ.5116లు ఇచ్చారు. వెంకటరెడ్డి, గుమ్మళ్ల వెంకట్రావు పాల్గొన్నారు.

పింఛన్ల రద్దు దారుణం

నెల్లూరు :జిల్లా అధికార యంత్రాంగం వెరిఫికేషన్ పేరుతో పింఛన్లు రద్దు చేయడం దారుణం వెంటనే అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఏఐవైఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. సోమవారం నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షానవాజ్, ఏఐవైఎఫ్ నాయకులు గౌస్, మధు, సర్దార్, బాదుల్లా, జలీల్, ముత్యాలు, బాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -గుడ్లూరు : మండలానికి చెందిన ఇద్దరు కార్యకర్తలు, ఇటీవల కందుకూరులో జరిగిన దుర్ఘటనలో గాయపడ్డారు. మండలం అమ్మవారిపాలెం గ్రామానికి చెందిన గుండెమడుగుల ప్రకాశం కు కాలు విరగగా, గుడ్లూరు గ్రామానికి చెందిన కొమ్మి మాల్యాద్రి స్వల్పంగా గాయపడ్డారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు వారిద్దరిని ఫోన్లో పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. గాయాల నుంచి కోరుకునే వరకు ఆర్థికంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన ఆదేశాలతో, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, ఇతర నాయకులు వారిని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. వైద్య ఖర్చులకోసం ప్రకాశంకు రూ. 30 వేలు, మాల్యాద్రికి 10వేలు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు పువ్వాడి శ్రీను, పార్టీ నాయకులు రావూరి వేణుగోపాల్, పువ్వాడి వేణుగోపాల్, మేకపోతుల రాఘ వయ్య, మండల తెలుగు యువత అధ్యక్షుడు చెన్నారెడ్డి మహేష్ పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు

'టిఆర్ఆర్' విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి -కందుకూరు : రాష్ట్ర స్థాయి హాకీ జట్టుకి కందుకూరు టిఆర్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎంపికైంది. 2022-2023 సంవత్సరాలకు సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలు విశాఖపట్నం జిల్లా నక్కపల్లిలో ఈ నెల 1వ తేదీ వరకూ జరిగాయని పిడి సుబ్బారావు తెలిపారు. ఈ పోటీలలో ప్రకాశం జిల్లా బాలికల జట్టు మూడో స్థానంలో నిలిచి బ్రాంచ్ మెడల్ సాధించింది అన్నారు. ఈ జట్టులో కందుకూరు టిఆర్ఎస్ కళాశాల విద్యార్థినిలు పి నందిని, వరలక్ష్మి పాల్గొన్నారు. నందిని గోల్‌కీపర్‌గా ఉమెన్ ఆఫ్ ది టోర్నమెంట్ బెస్ట్ గోల్ కీపర్‌గా అవార్డును సాధించి ప్రకాశం జిల్లా జట్టు కాంశ్య పథకం సాధించడానికి కారణం అయిందని సుబ్బారావు తెలిపారు. ఎపి జట్టుకి గోల్‌కీపర్‌గా ఎన్నిక కాబడినట్లు చెప్పారు. త్వరలో జాతీయస్థాయి అండర్ 19 హాకీ పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ విద్యార్థిని కర్ణాటకలోని కోడగు జిల్లాలోని మీడికేరి స్పోర్ట్స్ అథారిటీ ఇండియా హాస్టల్లో గోల్‌కీపర్‌గా శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. నందిని, వరలక్ష్మి లను కళాశాల ప్రిన్సిపాల్ కదిరి నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ సుబ్బారావు, సిబ్బంది అభినందించారు.



పోర్టులో ఈ- పాస్ విధానం

పాస్ సెక్షన్ ప్రారంభించిన సిఇఒ

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఆదాని కష్ణపట్నం పోర్టు యాక్సిస్ సెంటర్ ను (పాస్ సెక్షన్) సోమవారం పోర్టు సిఇఒ జి జె రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిటర్ మేనేజ్మెంట్ సిస్టం (విఎంఎస్)ద్వారా ఆన్ లైన్ లో ఈపాస్ అందజేయడం పై హర్షం వ్యక్తం చేశారు. ఆదాని కష్ణపట్నం పోర్టు లో వివిధ పనుల కోసం లేదా సందర్శన కోసం వచ్చేటువంటి వ్యక్తులు తప్పనిసరిగా ఈపాస్ కలిగి ఉండాలని సెక్యూరిటీ హెడ్ మేజర్ వెంకటేష్ భాస్కర్ తెలిపారు. విజిటర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా సులభతరంగా ఆన్ లైన్ ఈ పాస్ పొందేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోర్టులోనికి అనుమతి కోసం ముందుగా ఆయా వ్యక్తుల వివరాలను వెబ్‌సైట్ ద్వారా తమ ఆధార్ కార్డు లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులు ఉపయోగించి వారి ఫోటోను పంపితే వెంటనే ఇచ్చిన సెల్ ఫోన్ కు మెసేజ్ ద్వారా ఫోటోతో పాటు క్యూఆర్ కోడ్ కలిగిన ఈ పాస్ పొందవచ్చని ఆయన తెలిపారు. ఈపాస్ పొందినవారు అందులో తెలిపిన వివరాల ప్రకారం ఆయా ప్రాంతాలకు మాత్రమే పోర్టులోనికి అనుమతిం చబడుతుందని, ఈ పాస్ అనుమతి లభించకపోతే ఎందుకు లభించలేదు అనే వివరాలను ద్వారా వెబ్ సైట్ లో తెలుసుకోవచ్చునన్నారు. వి ఎం ఎస్ ద్వారా సులభతరంగా ఈపాస్‌ను పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి ఓ ఓ సంజయ్ కోత, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జి వేణుగోపాల్, మనోహర్ బాబు దివ్య ప్రణీత్, గుడివాడ శ్రీకాంత్ వెంకటేశ్వర్లు, ఆదానీ కష్ణపట్నం పోర్ట్ వివిధ విభాగాల హెచ్చోడీలు పాల్గొన్నారు.



ఈ- సెక్షన్‌ను ప్రారంభిస్తున్న సిఇఒ జిజె రావు



వైభవంగా వైకుంఠ ఏకాదశి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని శాఖవరంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి హనుమంత వాహనం జరిగింది. ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు. సోమవారం స్వామివారి ఉత్తరద్వార దర్శనం జరిగింది. గ్రామ స్తులు అధికసంఖ్యలో ఆలయానికి వెళ్లి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. వలేటివారిపాలెం సొసైటీ అధ్యక్షులు వడ్లమూడి రమేష్‌బాబు, మాజీ ఏఎంసి డైరెక్టర్ వడ్లమూడి నరసయ్య ఉన్నారు.

రాపూరు : మండలంలోని పెంచలకోన క్షేత్రంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ చైర్మన్ ధర్మకర్త మండలి సభ్యులు పర్యవేక్షణలో బంగారు గరుడ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు :ముక్కోటి ఏకాదశి సందర్భంగా. మండలం క్రేంద్రమైన ఉలవపాడు లోని శ్రీ వేణుగోపాల్ స్వామి దేవాలయం లో ఉత్తర ద్వార దర్శనం సోమవారం ఉదయం ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యానివాహణాధికారి భక్తులు పాల్లొని గ్రామహోత్సం నిర్యాహించారు.

'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం

నెల్లూరు : స్పందన వేదికలో అందే ఫిర్యాదుల పరిష్కారంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల సిబ్బంది నిబద్ధత పాటించాలని, నిర్దేశించిన సమయంలోపు సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలని ఇంఛార్జ్ కమిషనర్ సంపత్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం జరిగిన స్పందన వేదికలో ఫిర్యాదుదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించి గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అందరికీ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఇచ్చిన మాట కోసం ఎన్ని కష్టనష్టాలైనా భరించి అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చేజర్ల ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని 15 సచివాలయాల పరిధిలో నూతనంగా మంజూరైన 137 సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా తాను ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంవత్సరం పింఛను నగదును పెంచుకుంటూ ఈ సంవత్సరం లబ్ధిదారులకు రూ.2750 నగదును అందజేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్నట్లు వివరించారు. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వాన్ని తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బాలిరెడ్డి రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి, చేజర్ల మండల కన్వీనర్ తోమాటి విజయభాస్కర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు భూదళ్ల వీర రాఘవరెడ్డి, ఎంపిడిఒ విజయలత, తహశీల్దార్ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

4న వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతారామపురం : అంధుల లిపి నిర్మాత లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని ప్రపంచ అంధత్వ దినోత్సవం సందర్భంగా వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 4వ తేదీ ఉదయగిరిలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నెల్లూరు ఐ హాస్పిటల్ వైద్యులతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదిని రమణయ్య, ఎం.భారతీ సోమవారం ప్రకటన విడుదల చేశారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు శాంతకుమారీలు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు రైలు పాసులు ఇస్తారన్నారు. కావలసినవారు ఆధార్, రేషన్ కార్డు, సదరన్ మెడికల్ సర్టిఫికెట్లు (చిన్నవి, పెద్దవి) జెరాక్స్‌లతో పాటు రెండు ఫోటోలు తీసుకురావాలన్నారు.

పింఛన్లు పంపిణీ



ప్రజాశక్తి-సీతారామపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల వారోత్సవాల్లో భాగంగా నూతన పింఛన్లను పలు పంచాయతీలలోని లబ్ధిదారులకు పింఛన్ నగదును సర్పంచులు, నాయకులు, అధికారులు పంపిణీ చేశారు. సీతారామపురం బిట్-1 సచివాలయంలో నూతనంగా పెన్షన్ తీసుకుంటున్న 31 మంది లబ్ధిదారులకు సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, బిట్-1 ఎంపిటిసి పిసి అల్లూరు రాజు, మాజీ వైస్ ఎంపిపి రామిరెడ్డి తిరుపతయ్య చేతుల మీదుగా అదే విధంగా గుండుపల్లి పంచాయతీలో ముగ్గురు నూతన పింఛన్‌దారులకు సర్పంచ్ చెప్పలి తిరుపతిరెడ్డి, నాయకుడు దుగ్గిరెడ్డి చేతుల మీదుగా మారంరెడ్డిపల్లి పంచాయతీలో స్థానిక నేత గాజులపల్లి చంద్రారెడ్డి చేతుల మీదుగా 9 మంది నూతన పింఛన్ దారులకు నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, భాదర్ పాషా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



'మత్తు' నివారణపై అవగాహన



ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను ఇందుకూరుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎం.బాలకృష్ణ విద్యార్థులకు వివరించారు. సోమవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎం.బాలకృష్ణ సోమవారం నాగారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎంకెర్ స్కూల్లో విద్యార్థులకు మత్తు కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్ర కుటుంబానికి మేకపాటి పరామర్శ



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండలం అప్పారావుపాలెం వైసిపి నాయకుడు చంద్ర హజరత్ నాయుడు తండ్రి చంద్ర వద్యయ్యనాయుడు సోమవారం మృతి చెందడంతో ఆ కుటుంబసభ్యులను ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. వద్యయ్యనాయుడు మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. చంద్ర కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఆత్మకూరు ఎంపిపి కేత వేణుగోపాల్‌రెడ్డి, కాలం బుజ్జిరెడ్డి, వైసిపి నాయకులు పెమ్మసాని శ్రీనివాస్ నాయుడు, తదితరులున్నారు.

భూ సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-దగదర్తి : మండల పరిధిలోని ఉచగుంటపాలెంలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని సోమవారం స్పందన సందర్భంగా గ్రామస్తులు జెసి కూర్మానాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఉచగుంటపాలెం గ్రామ సర్వేనెంబర్ 175,200, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ, ఇతర కులాలవారికి ఒక్కొక్కరికి ఒక ఎకరం చొప్పున 20 ఎకరాలు పట్టాలు ఇచ్చారు. అయితే పక్క గ్రామమైన పెయ్యలపాలెం వాసులు దౌర్జన్యంగా ఆ పొలాల్లోకి దిగిపోవడంతో ఇవి మావి అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని తహశీల్దార్, ఆర్‌డిఒకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. రైతు సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సిఎస్‌ఆర్ కోటిరెడ్డి, గ్రామస్తులు ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఎందుకు పట్టించుకోవట్లేదో అర్థం కావట్లేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి గ్రామస్తులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కావలి : కావలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం 4వ తేదీన ఉదయం 10 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ ఎ.వి. సుబ్బారావు ప్రకటనలో తెలిపారు. కావున సమావేశానికి గౌరవ ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులందరూ హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సదరు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప గ్రామంలో ఉన్న బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన సంవత్సర సందర్భంగా కళాశాల విద్యార్థులకు దాతల సహకారంతో ప్రతిరోజు మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కొందరు విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు వస్తున్నారని, వారికి మధ్యాహ్న భోజనం అందిస్తే సౌలభ్యంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దాతలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులున్నారు.

నేటి నుంచి షటిల్ టోర్నమెంట్

ప్రజాశక్తి ఇందుకూరుపేట : మండలంలోని ఇందుకూరుపేటలో కామాటి వీధిలో మంగళవారం నుండి జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ వాసు తెలిపారు. ఈ పోటీలు మంగళవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభిస్తారని, సాయంత్రం 5 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి-కోవూరు : జిల్లాలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఏపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఎపిఎస్ఎస్‌డిసి సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 26వ తేదీన ప్రారంభమైన పి.సి.బి వర్క్ షాప్ నేటితో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆదివారం ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగంలో టెక్నికల్ సాంకేతిక కీలక పాత్ర పోషిస్తుందని తెలియజేశారు. పిసిబిపై ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం విద్యార్థులకు సమగ్రమైన అవగాహన కల్పించే ప్రధాన ఉద్దేశంతో ఈ వర్క్ షాప్ నిర్వహించినట్లు తెలిపారు. శిక్షకులు రుబీనా, కళాశాల ప్రిన్సిపాల్ సందీప్ కుమార్, ఐఐసిసి విభాగాధిపతి డాక్టర్ పి చక్రపాణి, అధిపతులు టి.రవికుమార్ సిహెచ్ శిల్ప, ప్రియాంక, ఇతర అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

తూ.తూ.మంత్రంగా గ్రామసభ

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభను, నాయకులకు మీడియాకి తెలియజేయకుండా తూతూ మంత్రంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో అనేక సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటే ఎవరికి తెలియకుండా గ్రామ సభలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నిసార్లు సమస్యలు విన్నవించుకున్నా ఫలితం శూన్యం. నేడు జరుగు గ్రామసభలో తమ సమస్యలు గురించి వివరిస్తామని వచ్చినప్పటికీ గ్రామ సభ అయిపోయిందని గ్రామస్తులు బాధపడుతూ ఆవేదన వ్యక్తం చేశారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-కావలి


ఆర్‌డిఒ శీనా నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కావలి పట్టణంలో ప్రధానమైన పెద్దపవని బస్టాండు ఓవర్ బ్రిడ్జి పనులను ప్రారంభించాలని సిపిఎం నాయకులు సోమవారం ఆర్‌డిఒ వి.కె.శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో ప్రధానమైన పెద్దపవని బస్టాండుకు వచ్చే రోడ్డులో పట్టణ నడిబొడ్డున రైల్వే లైను ఉన్నందున అక్కడ రైల్వే గేట్ వల్ల గంటల తరబడి ట్రాఫిక్ ఆగిపోయి ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులలో ప్రజలు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న అప్పటి ప్రభుత్వం కావలి మాజీ ఎంఎల్‌ఎ మాగుంట పార్వతమ్మ బ్రిడ్జి నిర్మాణానికి 2009 సంవత్సరంలో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రైల్వే పరిధిలో ఉన్న బ్రిడ్జీ నిర్మాణం పూర్తయి, ఇప్పటికీ సుమారు 14 సంవత్సరాలు అవుతున్నప్పటికీ బ్రిడ్జీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. ప్రభుత్వాలు మారిన బ్రిడ్జి పూర్తి కాలేదని ప్రజల ఇబ్బందులు తీరలేదని దీనివల్ల ముఖ్యంగా పట్టణ ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గ్రామాల నుండి పట్టణానికి వచ్చిపోయే ప్రయాణికులు సంవత్సరాలు తరబడి రాకపోకలకు పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోవట్లేదని వాగ్దానాలకే పరిమితం అయినారని, రైల్వే పరిధిలో ఉన్న బ్రిడ్జీ పూర్తయిన ప్పటికీ మిగతా పనుల ఊసేలేకపోవడం విచారకరమైన విషయమన్నారు. బ్రిడ్జీ నిర్మాణ పనులలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే బ్రిడ్జీ పనులను ప్రారంభించాలని సిపిఎం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. దీనిపై దశల వారీ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. పట్టణ కమిటీ సభ్యులు వై.క్రిష్ణ మోహన్, జి.మధుసూదన రావు, పి.పెంచల నరసింహం, సిపిఎం నాయకులు బి.కృష్ణయ్య, వి.బాబురావు, పి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కోవూరు



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఏళ్ల నుంచి లబ్ధిదారులు తీసుకుంటున్న పింఛన్లను అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అనేక కారణాలతో తొలగించడం అన్యాయమని సిపిఎం కోవూరు మండల కార్యదర్శి గండవరపుశేషయ్య ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. భూమి లేకున్నా ఉన్నట్లుగాను కరెంట్ బిల్లు అధికంగా వస్తుందని, 100 గజాల్లో ఇల్లు నిర్మాణం ఉందని, అనేక కారణాలు చూపించి కొత్త పింఛన్ల కంటే తొలగించినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. వలంటరీ ద్వారా నోటీసులు ఇవ్వడం తీసుకున్న వద్దులు మానసిక ఆందోళన గురికావడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం అన్నారు. నెల వచ్చేసరికి అనారోగ్యంతో బాధపడుతున్న వద్దులు మందులు అవసరాలు తీరుతాయని ఆశతో ఉంటే మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ప్రభుత్వం తొలగించడం, గడప గడపకు వెళ్లి నీతులు బోధించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అర్హులైన పేదలందరికీ వెంటనే మంజూరు చేయాలని సిపిఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దబ్బయ్య, ఎస్‌కె బాబు, రమేష్, సురేంద్ర, సురేష్, సుబ్బారావు, హరి, గోవర్ధన్, జానకిరామ్, విజయ్ కుమార్, శ్రీనివాసులు, అఖిల్, అహ్మద్, రమణయ్య, మస్తానయ్య, విజయమ్మ, మణి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికే సిఎం పెద్దపీట

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతుల అభ్యున్నతికే పెద్దపీట వేస్తూ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని ఆత్మకూరు ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చేజర్లలో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో నాబార్డు నిధుల ద్వారా రైతుల సౌలభ్యం కోసం నిర్మించిన గోడౌన్లను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఎంఎల్‌ఎ లాంఛనంగా ప్రారంభించారు. తొలుత మండల కేంద్రానికి వచ్చేసిన ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఎంఎల్‌ఎ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం చేజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో నూతనంగా నిర్మించిన గౌడౌన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాదాన్యాత ఇస్తుందన్నారు. రైతుల సౌలభ్యం కోసం గోడౌన్ల నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అందజేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, గౌడౌన్ల నిర్మాణాలు సైతం రైతుల అభ్యున్నతి కోసమే చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో చేజర్ల మండల వైసిపి కన్వీనర్ తోమాటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపిపి బాలిరెడ్డి రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు భూదళ్ల వీర రాఘవరెడ్డి, తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎంపిడిఒ విజయలత, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతసాగరం


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మండలంలోని ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన అనంతసాగరం గ్రామసభలో సిపిఎం పార్టీ ప్రతినిధులు పాల్గొని పంచాయతీలో ఉండే సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చి సమస్యలు పరిష్కరించాలని గ్రామసర్పంచ్, పంచాయతీ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ అనంతసాగరం పంచాయతీలో కొంత మందికి అనేక కారణాలతో పింఛన్లు రద్దు అయ్యాయని, రద్దు అయిన పింఛన్లు కొనసాగించాలని, జగనన్న ఇంటి స్థలాలు ఇచ్చిన వారికి అనేక కారణాలతో రద్దు చేసే ప్రయత్నం జరుగతుందన్నారు. ఇచ్చిన ఇంటి స్థలాలు రద్దు చేయరాదని అలా చేస్తే సిపిఎం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే చిన్నలాల్‌బాగ్, సబ్ స్టేషన్ దగ్గర ఉండే ఎస్‌సి కాలనీ, పూసల కాలనీ, హిందూ స్కూల్, హై స్కూల్ వెనుక భాగం ఉండే వీధులలో, సంజీవనగరంలోని కొన్ని వీధులలో సిమెంట్ రోడ్లు వేయాలన్నారు. అలాగే కొన్ని వీధుల వారు డ్రెయినేజీ వ్యవస్థ కావాలని కోరుతున్నారన్నారు. దిగవూరు లైబ్రరీ దగ్గర ఎప్పుడు నీళ్ళు నిలబడడంతో దీని వలన దోమలు చేరి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. రాత్రులలో వైద్యం కోసం డాక్టర్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనంతసాగరం బస్టాండ్ సెంటర్లో ఆవుల మందలు ఎక్కువ వచ్చి కూర్చోవడం వల్ల వాహనదారులకు, దుకాణ దారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పందుల సమస్య కూడా ఎక్కువ ఉందని పెద్ద మసీదు వద్ద ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరారు. సంజీవ నగర్‌లో ఉపాధి హామీ పనులకు వెళ్లని వారికి కూడా పని డబ్బులు పడుతున్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మస్తాన్, రాటకొండ పెంచలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.



కళాశాల వద్ద ధర్నా చేస్తున్న ఎస్.ఎఫ్.ఐ. నాయకులు

'విట్స్'లో విద్యార్థులకు ఫీజుల కష్టాలు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో ఉన్న విట్స్ ఇంజనీర్ కాలేజీ యాజమాన్యం ఫీజుల విషయంలో విద్యార్థులను పలు రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఆరోపించారు. సోమవారం ఎస్ఎఫ్ఐ కావలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కాలేజీ వద్ద విద్యార్థులు బైఠాయించి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఫీజులు కడితేనే అప్లికేషన్ అప్లికేషన్ ఫారం రాయిస్తామంటూ కాలేజీ యాజమాన్యం విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం చాలా దారుణమన్నారు. పరీక్షల టైంలో రకరకాల ఫైన్‌లు పేరుతో విద్యార్థుల వద్ద నుండి వేల రూపాయలు వసూలు చేస్తూ, విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. హాస్టల్ విద్యార్థులను కూడా హాస్టల్ ఫీజు మొత్తం కడితేనే ఎగ్జామ్ రాయడానికి అనుమతి ఇస్తామంటూ చెప్పడం చాలా సిగ్గుచేటన్నారు. యాజమాన్యం ఒత్తిడితో విద్యార్థులు మానసికంగా బాధపడుతున్నారన్నారు. చదువుల మీద దృష్టి పెట్టలేక పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కాలేజీ యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యార్థులపై ఒత్తిడిని ఆపాలన్నారు. అలా లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం కొనసాగిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో డైఫీ కావలి పట్టణ కార్యదర్శి పి.పెంచల నరసింహం, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, సూర్య, నాయకులు రాకేష్, ఉదయ్, అభి, సాయి, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరులో అన్నదానం

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రంలోని మసీద్ సెంటర్ సమీపంలోని నాగూర్ మీరావలి జెండా చెట్టు వద్ద సోమవారం గంధ మహోత్సవాన్ని పురస్కరించుకుని ముస్లీం సోదరులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దల మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. పేద ప్రజలకు అన్నదానం చేయడమే మహా అద్భుతమని పేర్కొన్నారు.

టిడిపి నేత హర్ష పరిస్థితి విషమం

ప్రజాశక్తి-కావలి



బోగోలు మండలం కడనూతల గ్రామానికి చెందిన తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పైడి హర్ష ఆరోగ్యం విషమంగా ఉందని టిడిపి నాయకులు వెల్లడించారు. గత నెల 28వ తేదీన కావలి ఎంఎల్‌ఎ ఇంటి ముందు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆరోజు కావలి పట్టణ ప్రభాకర్ నాయుడు హాస్పిటల్‌లో ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరు అపోలో హాస్పిటల్‌కి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి హర్ష పరిస్థితి ఆందోళనకరంగా ఉండగా చెన్నై అపోలో హాస్పిటల్‌కు పంపించారు. సోమవారం చెన్నై అపోలో హాస్పిటల్ వారుఇతని పరిస్థితి మరీ క్షీణించిందని, కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడుకి తెలుపగా, హుటాహుటిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, వెంకటగిరి మాజీ శాసనసభ్యులు కురుగుండ్ల రామకృష్ణ, నెల్లూరు పార్లమెంట్, రైతు ప్రధాన కార్యదర్శి జలదంకి శ్రీహరి నాయుడులతో కలిసి, చెన్నై అపోలో హాస్పిటల్‌కి చేరుకున్నారు. వెంటిలేటర్‌పై ఉన్న హర్షను చూసి, వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యాన్ని అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని ధైర్యం చెబుతూ, పైడి హర్షకు ఎటువంటి ఆపద జరగకుండా ఉండాలని ఆకాంక్షించారు.

ఘనంగా పోలేరమ్మ ఉత్సవం

ప్రజాశక్తి-అల్లూరు


మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

సాంప్రదాయ బద్ధంగా అంగరంగ వైభవంగా పోలేరమ్మ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని అల్లూరు మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం స్థానిక ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఉత్సవానికి సంబంధించి అనేక విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా కుల, మతాలకు అతీతంగా ఊరు పెద్దల సహకారంతో గంగమ్మ కలుగోళమ్మ, పోలేరమ్మలకు ఒకేసారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి ప్రసాదాలు నిర్వహిస్తున్న క్రమంలో ముస్లిములు, క్రైస్తవులు విచ్చేసి స్వీకరిస్తున్నారని తెలిపారు. సద్ది నివేదన, కథా కాలక్షేపం, బైనాడి ఆచారాలు, కొమ్ము తదితర ఆచారాలతో ముగ్గురు అమ్మవార్లను ఊరేగిస్తామని ఆయన తెలిపారు. ఉత్సవాన్ని నిర్వహిస్తున్న నాటి నుండి గ్రామం సుభిక్షంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఆ తల్లి ఆశీస్సులతో అందరికీ మంచి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తపరిచారు. అధికారుల సహకారం మెండుగా ఉందని అందులో భాగంగా కావలి ఆర్‌డిఒ శీనానాయక్ నేతృత్వంలో సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఇరిగేషన్ శానిటైజేషన్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, నగర పంచాయతీ అధికారులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని కోరారు. ఎప్పుడు ఉత్సవం నిర్వహించినా భక్తులకు సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అమ్మవారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతేడాది భక్తుల సంఖ్య అధికంగా పెరుగుతుందని ఈ ఉత్సవాన్ని రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెస్తామని హామీనిచ్చారు. అనంతరం అల్లూరుపేటలోని గంగమ్మ దేవాలయం, కలగోళమ్మ దేవస్థానాలను పరిశీలించారు. కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, తదితరులున్నారు.

మహేష్‌నాయుడిపై అట్రాసిటీ కేసు పెట్టాలి


బాధితుడు తేజను పరామర్శిస్తున్న కె. వి. పి. ఎస్. నాయకులు

ప్రజాశక్తి-కావలి : దగదర్తి మండలం, ఉలవపాళ్ల వద్ద పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న గోచి పాతల తేజ అనే దళితుడిపై దాడి చేసి, గాయ పరిచిన వైసిపి నాయకుడు, ఎంపిటిసి మహేష్ నాయుడిపై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి, కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరి తిరుపాలు, రాష్ట్ర కమిటీ సభ్యులు గంపా సుధీర్ డిమాండ్ చేశారు. సోమవారం వారు కావలి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు తేజాను పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారపార్టీకి చెందిన ఎంఎల్‌ఎ అనుచరుడు దళితుడిపై దాడి చేయడం దారుణమన్నారు. తక్షణం అతడిని అరెస్ట్, చేసి బాధితుడికి ప్రభుత్వం నుండి తగు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. బాధితుడి ఆరోగ్య దృష్ట్యా కావలి నుంచి నెల్లూరు పెద్దాసుపత్రికి తరలించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పి.పెంచలయ్య, వ్య.కా.సం. జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి, అలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ పి.కిరణ్, కెవిపిఎస్ సభ్యులు చరణ్ పాల్గొన్నారు.

దళితులపై దాడులు అమానుషం - మాలేపాటి

ప్రజాశక్తి-కావలి : దగదర్తి మండలం, ఉలవపాళ్ల గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న దళిత యువకుడైన తేజపై బోడిగుడిపాడు వైసిపి ఎంపిటిసి మహేష్ నాయుడు దాడి చేసి కాళ్లతో, రాడ్డుతో తీవ్ర స్థాయిలో కొట్టడంతో కావలిలోని ఏరియా ఆసుపత్రిలో తేజ చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, తదితర టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి సోమవారం హాస్పిటల్‌కి వెళ్లి తేజాను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలు కావలి నియోజకవర్గంలో దళితులపై ఎంఎల్‌ఎకు ఇంత వివక్ష ఎందుకని ప్రశ్నించారు. గతంలో కరుణాకర్‌ను పొట్టన పెట్టుకున్నారని, గత వారంలోనే పైడిహర్షను ఆత్మహత్య చేసుకునే స్థితికి తీసుకువచ్చారన్నారు.



ప్రజాశక్తి - కావలి : మహేష్ నాయుడుపై హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసు నమోదు చేయాలని కావలి జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు బాధితుడిని పరామర్శించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ముందు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. జనసేన పట్టణ అధ్యక్షులు పొబ్బ సాయివిఠల్, ఉపాధ్యక్షుడు గడే నాగార్జున, అధికార ప్రతినిధి టి.సుధీర్, రూరల్ నాయకులు లక్ష్మణ్, ఖలీషా, ప్రవీణ్, రాము, ఫణి, వంశీ, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ముక్కోటి ఏకాదశి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం భక్తులు సోమవారం ఎక్కువ జాము నుంచే భక్తులతో పలు ఆలయాలు కిటకిటలాడాయి. జెఆర్‌పేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు వేకువజామునే క్యూ కట్టారు. ఎస్‌ఐ ఎం.శివ శంకర్రావు తన సిబ్బందితో ఆలయ వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎత్తకుండా పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు దంపతులు సైతం క్యూలో వెళ్లి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలో ఉన్న బిలకుంట క్షేత్ర శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి పేర్కొన్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దంపతులు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలం శ్రీ కొలను గ్రామంలో ఉన్న శ్రీ సీతాకోదండ రామస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా దేవాలయంలో ముక్కోటి మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-మర్రిపాడు



మండలంలోని కంపసముద్రం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయక పోగా నేడు జగనన్న ప్రభుత్వం అర్హులను వెతికి లబ్ధి చేకూరుస్తుందన్నారు. జగనన్న మూడున్నరేళ్ల పాలనలో ప్రతి గడపలో అర్హత గల వారికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మూడేళ్లలో 95శాతం అమలు చేశామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటికే ప్రభుత్వ సేవలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ అమర్నాద్ రెడ్డి, బూదవాడ సొసైటీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఏపిలిగుంట, కేతిగుంట, కంపసముద్రం సర్పంచ్‌లు నారాయణ రెడ్డి, హరితేజ, వెంగయ్య, ఏపిలిగుంట ఎంపిటిసి హాజరత్ రెడ్డి, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భూ పంపిణీ చేయాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు



ప్రజాశక్తి-కావలి : గ్రామాల్లో భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వ్య.కా.సం. నాయకులు ఎ.సుబ్రమణ్యం, జి రాజులు కావలి ఆర్‌డిఒ వి.కె.శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుభూమి లేని నిరుపేలు లక్షలాది మంది ఉన్నారని అన్నీ జిల్లాలో ప్రభుత్వ భూములు పంపిణీ చేయడానికి అనువుగా ఉన్నాయని, పేదలకు పంచాలని దీర్ఘకాలంగా డిమాండ్ ఉందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కోనేరు రంగారావు భూ కమిటీని నియమించారని, ఈ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అన్నిరకాల ప్రభుత్వ భూములు పేదలకు ఇళ్ల స్థలాలకు, సాగుభూములు ఇవ్వొచ్చని 104 సిఫార్సులు చేసిందన్నారు. 92 అంశాలను వైఎస్ ప్రభుత్వం ఆమోదించిందని, తరువాత వచ్చిన ప్రభుత్వాలు భూ కమిటీ సిపార్సులు అమలు జరపకుండా చెత్త బుట్టలోచీకటి గదిలో పడేశారన్నారు. తక్షణమే స్పందించి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సాగు భూములు లేని నిరుపేదలకు దీర్ఘకాలం పేదలు సాగుచేసుకుంటున్న భూములకు నివాసముంటున్న ప్రభుత్వ స్థలాలకు అన్ని హక్కులతో పట్టాలు ఇవ్వాలని ఆర్‌డిఒను కోరారు.